సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



మార్కెట్లకు శ్రావణ శోభ

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. 8లో పూజా సామగ్రి, ధరలు చుక్కలనంటాయి.



బ్రహ్మకుమారీస్ రక్షాబంధన్

అల్లిపురం: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఏర్పాటు చేసిన రక్షాబంధన్ వేడుకల్లో సీపీ శంఖబ్రతబాగ్చి పాల్గొన్నారు.



'హర్ ఘర్ తిరంగా' పోటీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ రైల్వే డివిజన్ హర్ ఘర్ తిరంగాలో భాగంగా రంగోలి, వ్యాసరచన, క్విజ్ పోటీలు, సైకిల్, బైక్ ర్యాలీలు నిర్వహించింది.

న్యూస్‌రీల్

చేనేత కళాకారులకు చేయూత

- కలెక్టర్ విజయ్ కృష్ణన్



చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ కృష్ణన్

అచ్యుతాపురం రూరల్: చేనేత కళాకారులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురం మండలంలోని దుప్పితూరు శ్రీ భద్రావతీ చేనేత సహకార సంఘం సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం మండల కాంప్లెక్స్‌లో ఉన్న సొసైటీని సందర్శించి అక్కడ తయారవుతున్న యోగా కార్పెట్స్, నవ్వారు తయారీ విషయమై చేనేతలను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులు వారి సమస్యలను కలెక్టర్‌కు వివరించగా.. అతి త్వరలో వారికి అవసరమైన ముడి సరకులు అందించి, క్లస్టర్ తరహాలో షెడ్ల నిర్మాణానికి భూమి కేటాయించి నిర్మాణాలు చేపడతామని, అక్కడే వృత్తి పనులు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ 1947లో స్థాపించిన నాటి నుండి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సంఘాన్ని ఒక క్రమ పద్ధతిలో ముందుకు తీసుకువెళ్లిన మేనేజర్ మాడెం అప్పారావును అభినందించారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు



జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌ని సన్మానిస్తున్న జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా

విశాఖ లీగల్ : క్రీడలు మనుషుల మధ్య పోటీతత్వాన్ని పెంచి మంచి ఫలితాలు అందిస్తాయని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడా సాంస్కృతిక వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతర కార్యశీలురని, వారికి ఆటవిడుపుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం చాలా అవసరమన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య మంచి వాతావరణాన్ని కలిగించడానికి ఈ వేడుకలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సిరిపురపు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈత పోటీల్లో జాతీయ స్విమ్మర్ న్యాయవాదుల సంఘం క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి బాలాజీ, సంఘం సీనియర్ సభ్యుడు ఆదారి అప్పారావు, భారీ సంఖ్యలో న్యాయవాదులు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన విశాఖ

వెల్డింగ్ దుకాణంలో పేలిన సిలిండర్



ప్రమాదస్థలం వద్ద సహాయచర్యలు చేపడుతున్న ఫైర్ సిబ్బంది

- భూకంపం వచ్చినట్లు అదిరిన వన్‌టౌన్
- రెండు కిలోమీటర్ల మేర పేలుడు శబ్దం
- ముగ్గురు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- 9 అడుగుల ఎత్తయిన గోడ దాటి పడిన మృతుల శరీర భాగాలు
- షాపు వెనుక 150 అడుగుల దూరంలో ఉన్న ఇళ్లపై పేలుడు ప్రభావం
- ఓ ఇంట్లో సీలింగ్ పడి చిన్నారికి గాయం



రోదిస్తున్న మృతులు, క్షతగాత్రుల బంధువులు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు యల్లాజీ, రంగారావు, సన్యాసిరావు, ఆస్పత్రిలో మృతిచెందిన ముత్యాలు

మృతులు
చల్లా గణేష్(44), శ్రీను (30), చింతకాయల ముత్యాలు(27)
క్షతగాత్రులు
ఎర్ర ఎల్లాజి(45), టి.సన్యాసిరావు(46), ఇప్పిలి రంగారావు(53)

విశాఖ సిటీ : విశాఖ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ విస్ఫోటనంతో పాత నగరం భూకంపం వచ్చినట్లు అదిరింది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఒక వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరి వ్యక్తుల శరీర భాగాలు 9 అడుగుల ఎత్తయిన గోడపై నుంచి ఎగిరి అవతల పడ్డాయి. పేలుడు కారణంగా సంభవించిన మంటల్లో చిక్కుకున్న నలుగురు తీవ్రంగా కాలిపోయారు. దీంతో వన్‌టౌన్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు కిలోమీటర్ల మేర ప్రజలను ఈ పేలుడు శబ్దం భయాందోళనకు గురిచేసింది.

చెల్లాచెదురైన శరీర భాగాలు

సున్నపువీధి ప్రాంతానికి చెందిన చల్లా గణేష్(44) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితమే బుక్కా వీధిలో ఫిషింగ్ హార్బర్ రోడ్డులో వెల్డింగ్ దుకాణాన్ని తెరిచాడు. ఒడిశాకు చెందిన శ్రీను హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం హెల్పర్ శ్రీను(30)తో పాటు మరో ఇద్దరు వర్కర్లు ఎర్ర ఎల్లాజీ(45), సన్యాసిరావు(46)లను పనికి పెట్టుకున్నాడు. వీరు ఎప్పటిలాగే వెల్డింగ్, గ్యాస్ కటింగ్ పనులు చేస్తుండగా సాయంత్రం 4.30 గంటలకు సిలిండర్ పేలిపోయింది. అక్కడే ఉన్న యజమాని గణేష్, హెల్పర్ శ్రీనుల మృతదేహాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. వెల్డింగ్ షాపు నామరూపాలు లేకుండా తునాతునకలైంది. పేలుడు ధాటికి మంటలు వ్యాపించాయి. అక్కడే పనిచేస్తున్న వర్కర్లు ఎర్ర ఎల్లాజీ, సన్యాసిరావుతో పాటు పక్కన ఉన్న స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న చింతకాయల ముత్యాలు(27), ఇప్పిలి రంగారావు(53) ఆ మంటలకు తీవ్రంగా గాయపడ్డారు.

ఆటోలో క్షతగాత్రుల తరలింపు

భారీ ప్రమాదం జరిగినప్పటికీ ఘటనా స్థలానికి 108 అంబులెన్సులు రాకపోవడం గమనార్హం. కేవలం మృతదేహాల తరలింపు కోసం మాత్రమే అంబులెన్సును తీసుకొచ్చారు. నలుగురు క్షతగాత్రులను ఆటోలో తరలించడంపై స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంటల్లో 90 శాతానికి పైగా కాలిన శరీరంతో బాధను తట్టుకోలేక.. ఆర్తనాదాలు పెడుతూ ఆటో ఎక్కడం అక్కడున్న వారందరినీ కలిచివేసింది.

ఇద్దరి పరిస్థితి విషమం

ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఎర్ర ఎల్లాజీ(45), సన్యాసిరావు(46), చింతకాయల ముత్యాలు(27), ఇప్పిలి రంగారావు(53)లను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. వీరిలో చింతకాయల ముత్యాలు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మరణించాడు. ఎల్లాజీ 95 శాతం, రంగారావు 75 శాతం మేర కాలిపోయారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. 18 శాతం కాలిన గాయాలైన సన్యాసిరావును చికిత్స కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

కంపించిన ఇళ్లు.. చిన్నారిపై పడిన సీలింగ్

ఒక్కసారిగా భారీ శబ్దంతో భూమి అదరడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో సుమారు 200 మీటర్ల వరకు ఉన్న ఇళ్లు కంపించాయి. వెల్డింగ్ దుకాణానికి 150 అడుగుల దూరంలో ఉన్న ఒక ఇంట్లో సీలింగ్ కూలింది. ఆ ఇంట్లో గాయత్రీ అనే చిన్నారి(11)పై ఆ పెచ్చులు పడ్డాయి. దీంతో ఆమె తలకు గాయమైంది. మరికొన్ని ఇళ్లు కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఘటనా స్థలానికి అధికారులు

ఘటనా స్థలాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సందర్శించారు. అక్కడ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యం గురించి వివరించారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మృతదేహాలను తరలిస్తున్న స్థానికులు

ఏ సిలిండర్ పేలింది?



ప్రమాద స్థలం వద్ద ఆక్సిజన్ సిలిండర్లు, డొమెస్టిక్ సిలిండర్, సిలిండర్ వాల్వ్

ఘటనా స్థలంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు డొమెస్టిక్ సిలిండర్ కూడా ఉంది. వీటిలో ఏ సిలిండర్ ప్రమాదానికి కారణమైందన్న విషయం తేలాల్సి ఉంది. సాధారణంగా డొమెస్టిక్ సిలిండర్ పేలితే అది ముక్కలైపోతుంది. కానీ అక్కడ ఉన్న సిలిండర్ బాగానే ఉంది. అలాగే ఆక్సిజన్ సిలిండర్లు మూడు ఉండగా.. ఒకదానికి మాత్రం పైన వాల్వ్ పడిపోయి ఉంది. సాధారణ సిలిండర్ కంటే ఆక్సిజన్ సిలిండర్ పేలుడు కారణంగానే భారీగా విస్ఫోటనం సంభవిస్తుంది. చదరపు ఇంచ్‌కు 2 వేల పౌండ్ల ఒత్తిడితో సంభవించే ఈ పేలుడుకు భారీ నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ సిలిండర్ పేలితే మాత్రం 5 మీటర్ల పరిధిలో ఉన్న వారికి మృత్యు ప్రమాదం ఉంటుందని, గరిష్ఠంగా 32 మీటర్ల దూరంలో ఉన్న వారికి గాయాలయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీని ప్రకారం ఈ ఘటనలో ఆక్సిజన్ సిలిండర్ పేలిందా? లేదా గ్యాస్ సిలిండర్ ప్రమాదానికి కారణమైందన్నది విచారణ చేయాల్సి ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పని దొరికింది.. హ్యాపీ అన్నాడు..



ప్రమీలా పని దొరికింది. ఇంత కాలం ఖాళీగానే ఉన్నా. ఇక మనకు పర్వాలేదు. పిల్లలకు హ్యాపీ అంటూ వెళ్లిన తన భర్త, పేలుడు ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ మరణించడంతో.. గుర్తు చేసుకుని వెక్కివెక్కి ఏడుస్తున్న చింతకాయల ముత్యాలు భార్య ప్రమీల కేజీహెచ్ మార్చురీ వద్ద ఉన్నవారిని కంటతడి పెట్టించింది. అర్ధంతరంగా వదిలి వెళ్లిపోయావు నాయనా.. పిల్లల్ని ఎవరు చూస్తారంటూ ప్రమీల తల్లి(ముత్యాలు అత్త) వేదన అంతా ఇంతా కాదు. పోస్టుమార్టం కోసం మార్చురీకి తీసుకెళ్తుండగా ముత్యాలు మృతదేహాన్ని చూసి ప్రమీల సొమ్మసిల్లిపోయింది. వీరు ఇద్దరు పిల్లలతో బుక్కావీధిలో ఉంటున్నారు.

అనాథలయ్యాం..



లోలోర 365 వర్క్‌షాప్‌ను 6 నెలల కిందట అప్పు చేసి రూ.3 లక్షలకు గణేష్ తీసుకున్నాడు. అంత వరకు టౌన్‌కొత్తరోడ్డు సమీపాన ఓ దుకాణంలో పనిచేశాడు. సొంతంగా దుకాణం పెట్టుకోవడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించాడు. ఆరు నెలల్లోనే భగవంతుడు తమ నుంచి దూరం చేశాడంటూ గణేష్ భార్య సుధ రోదించిన తీరు అక్కడున్నవారిని కలచివేసింది. సున్నపువీధిలో ఉంటున్న వీరికి టెన్త్ చదువుతున్న లక్ష్మీసంపత్, 8వ తరగతి చదువుతున్న వర్షిత్‌శ్రీ ఉన్నారు.

ఒంటరైన శ్రీను భార్య

ఇదే వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన శ్రీను కూడా మృతి చెందాడు. ఆరేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖ వచ్చిన శ్రీను బుక్కావీధిలోనే అద్దెకు ఉంటూ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. శ్రీను మరణంతో భార్య ఒంటరయింది.

- ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇప్పిలి రంగారావు(53) బుక్కావీధి, ఫిషింగ్ హార్బర్ రోడ్డులో స్క్రాప్ దుకాణం నడుపుతున్నాడు. తెలకలవీధి, చెంగల్రావుపేటలో నివాసం ఉంటున్నాడు. రంగారావు పెద్ద కుమారుడు జై నగరంలోని పోర్టు ట్రస్ట్‌కు సమీపాన ఓ స్క్రాప్ దుకాణం నడుపుతుండగా, రెండో కుమారుడు నవీన్ పారిస్‌లో బీబీఏ చదువుతున్నాడు. మూడో కుమారుడు గౌరీశంకర్ సీమెన్. భార్య భారతి గృహిణి. రంగారావు పరిస్థితి క్రిటికల్‌గానే ఉందని వైద్యులు తెలిపారు.

11 నుంచి సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టులు

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఈ నెల 11న పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్, 13న నర్సీపట్నం డివిజన్ కోటవురట్ల సెక్షన్, 21న అమలాపురం డివిజన్ మలికిపురం సెక్షన్, 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్, 29న రంపచోడవరం డివిజన్‌లోని రాజవొమ్మంగి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులను నేరుగా సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా నేరుగా గానీ, లిఖిత పూర్వకంగాగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సుల్లో చైర్‌పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొననున్నారు.

అర్హులనే బస్సు డ్రైవర్లుగా నియమించుకోవాలి

అనకాపల్లి టౌన్: అర్హత కలిగిన వ్యక్తులను మాత్రమే పాఠశాలల బస్సులకు డ్రైవర్లుగా నియమించుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను గురువారం ఆయన పరిశీలించారు. సహాయకుడు లేకుండా బస్సు వెళ్తుండడం, డ్రైవర్లకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి బస్సు డ్రైవర్ వద్ద ఆర్టీవో జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, బస్సులో తప్పని సరిగా మెడికల్ కిట్, ఫైర్ సేఫ్టీ కిట్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

క్రీడాకారుల జెర్సీ ఆవిష్కరణ

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 9 నుంచి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే ఉద్యోగులకు అందించే జెర్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడా ఉత్సవంలో క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో వీఎంఆర్‌డీఏలోని అన్ని విభాగాల నుంచి సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొంటారని వెల్లడించారు.

దక్కని గౌరవం.. అందని వేతనం.!

- ఎంపీటీసీ సభ్యులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- 16 నెలలుగా విడుదల కాని గౌరవ వేతనం నిధులు
- అత్యధిక శాతం వైఎస్సార్‌సీపీ సభ్యులు కావడంతో నిర్లక్ష్యం
- ప్రొటోకాల్‌కు మంగళం పాడేసిన అధికారులు
- గ్రామాల్లో కూటమి నేతలకే పెత్తనం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 651 మంది ఎంపీటీసీలు



సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల :

ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు వారంతా. పరిపాలనాపరమైన అంశాలలో వారి ఆమోదం తప్పనిసరి. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారికంగా పాల్గొనాల్సిన వారిని కూటమి ప్రభుత్వం కరివేపాకులా తీసి పడేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజాస్వామ్యానికే అర్థం మారిపోయింది. ఎంపీటీసీలను పక్కన పెట్టి.. ఏ సంబంధం లేని కూటమి నాయకులు అధికారిక కార్యక్రమాలను అంతా తామై నడిపిస్తున్నారు. అధికారులు సైతం వారికి వత్తాసు పలికి ప్రొటోకాల్‌కు పూర్తిగా మంగళం పాడేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను కాస్త టీడీపీ, జనసేన పార్టీ కార్యక్రమాల్లాగా నిర్వహిస్తున్నారు. పోనీ ఎంపీటీసీ సభ్యుడిగా గుర్తింపు దక్కలేదు.. కనీసం వారికి వచ్చే గౌరవ వేతనం కూడా 16 నెలలుగా ఇవ్వడం లేదు. దీనికి కారణం గత స్థానిక ఎన్నికల్లో 90 శాతానికి పైగా స్థానాలు వైఎస్సార్‌సీపీకి దక్కడమే. అందుకే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి అవమానిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

గౌరవ వేతనానికీ దిక్కులేదు..

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులకు గౌరవం ఇవ్వక పోగా.. వారికి ఇచ్చే గౌరవ వేతనం కూడా అందని పరిస్థితి నెలకొంది. ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనంగా అందివ్వాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం జూన్ 12న పగ్గాలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూలై నుంచి అక్టోబర్ వరకు నాలుగు నెలలకు మాత్రమే ఎంపీటీసీ సభ్యులకు గౌరవం వేతనం చెల్లించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2023 డిసెంబర్ వరకూ రెండు విడతలుగా గౌరవ వేతనాన్ని చెల్లించారు. మూడో విడత నిధులు విడుదల చేసేందుకు 2024లో బిల్లు పెట్టి చర్యలు తీసుకునే సమయంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వేతనాల చెల్లింపునకు ఆటంకం ఏర్పడింది. ఆ తర్వాత నుంచి నేటి వరకు ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాల బకాయిలు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

ఉమ్మడి విశాఖలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి విశాఖ జిల్లాలో 651 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరిలో 405 ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరికి చోటు కల్పించకుండా కూటమి నాయకులతో పని కానిచ్చేస్తున్నారు.

అధికార కార్యక్రమాల్లో ప్రాధాన్యం లేదు..



ప్రభుత్వం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాల్లో అధికారులు మాకు గుర్తింపు ఇవ్వడం లేదు. జోగుంపేట ఎంపీటీసీగా, గొలుగుండ మండల వైస్ ఎంపీపీగా ఉన్న నాకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. కొన్ని కార్యక్రమాలకు ఏదో నామమాత్రంగా సమాచారం ఇస్తున్నారు. మొత్తం టీడీపీ నాయకులే ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారు. జీతాలైతే ఎన్నికల్లో కోడ్ కారణంగా నిలిచిపోయాయి. ఇప్పటి వరకూ ఇవ్వనేలేదు.

– జక్కు నాగమణి, వైస్ ఎంపీపీ, గొలుగొండ మండలం

పేరుకే ఎంపీటీసీ సభ్యులం..



కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులను అవమానిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం కూడా తెలియజేయకుండా కూటమి నాయకులతో చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు ఏమాత్రం గౌరవం దక్కడం లేదు. పైగా కూటమి వచ్చాక గౌరవ వేతనం కూడా అందలేదు.

– పెట్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు, బి.కె.పల్లి

సమావేశాలకే పరిమితం..



కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ప్రజా ప్రతినిధులకు విలువ లేకుండాపోయింది. అధికారిక కార్యక్రమాలు పార్టీ కార్యక్రమాల్లా మారిపోయాయి. మమ్మల్ని మండల సమావేశాలకు మాత్రమే పిలుస్తున్నారు. 16 నెలలుగా గౌరవ వేతనం కూడా ఇవ్వలేదు.

– వంగలపూడి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు, కోటవురట్ల

సామాజిక కార్యకర్తపై హత్యాయత్నం

- గోవుల అక్రమ రవాణా గుట్టు రట్టు చేయడంతోనే దుండగుల దాడి



బాధితుడు నూకరాజు నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రామకృష్ణారావు



సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల : సామాజిక కార్యకర్త ఎస్.వి.ఎ.ఎస్.ఎస్.నూకరాజుపై ముగ్గురు వ్యక్తులు హత్యాయత్నం చేశారు. ఈ మేరకు బాధితుడు నూకరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్ల దేముళ్లు, సంపెంగి నానాజీతోపాటు మరో యువకుడు గురువారం మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలోని నూకరాజు ఇంటికి వెళ్లి పథకం ప్రకారం హత్య చేయడానికి ప్రయత్నించారు. కుర్చీలు, కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేసి రక్తం వచ్చేలా కొట్టి తీవ్రంగా గాయపరిచారు. 'మా మీదే ఫిర్యాదు చేస్తావా.. మాతోనే పెట్టుకుంటావా.. నిన్ను బతకనిస్తామా' అంటూ ఇష్టానుసారంగా దాడి చేశారు. ఎంత బతిమాలినా వినకుండా తీవ్రంగా కొట్టడంతో సొమ్మసిల్లిపడిపోయాడు. వెంటనే ఆ ముగ్గురు నూకరాజుకు చెందిన రెండు సెల్‌ఫోన్లు, డెస్క్‌టాప్, సీసీ కెమెరా యూనిట్ పట్టుకుని అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై వెంటనే ఎస్‌ఐ విభీషణరావుకు ఫిర్యాదు చేయగా ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. సీఐ రామకృష్ణారావు బాధితుడిని నక్కపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

గోవుల అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినందుకు..

నూకరాజు మాట్లాడుతూ మండలంలోని పలు సమస్యల పరిష్కారం కోసం పలువురు వ్యక్తులు తన వద్దకు వస్తుంటారని, వాటి పరిష్కారంలో చొరవ చూపినందుకు తనపై పలువురు కక్ష కట్టినట్టు తెలిపారు. ఇటీవల గోవుల అక్రమ రవాణాకు సంబంధించి గుట్టు రట్టు చేయడంతో గొర్ల దేముళ్లు అనే రౌడీషీటర్ తనపై కక్ష కట్టినట్టు చెప్పారు. గొర్ల దేముళ్లు గో సంరక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అక్రమాలకు పాల్పడుతూ ఆవులను సంరక్షిస్తున్నట్టు చెప్పి, తన వద్ద ఉన్న గోదాములో ఉంచి ఆపై విక్రయాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ఇదే విషయమై తాను గతంలో లోకాయుక్త, జిల్లా కలెక్టర్, ఎస్పీ, తహసీల్దారులతోపాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. అంతేకాకుండా సీఎం, డిప్యూటీ సీఎం, డీజీపీ, అదనపు డీజీపీ, ఇంటిలిజెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై ఇటీవల 'సాక్షి'లో 'రక్షకులు కాదు గో భక్షకులు' శీర్షికతో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీంతోపాటు డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ అనకాపల్లి ఎస్పీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు చేపట్టారు. దీంతో గొర్ల దేముళ్ల తనను హతమార్చేందుకు పథకం రచించినట్టు సామాజిక కార్యకర్త నూకరాజు తెలిపారు. ముందు కూడా తనకు ప్రాణహాని ఉందని, వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. హత్యాయత్నంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుల అండతో గూండాగిరి

టీడీపీ నాయకుల అనుయాయుల దందాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. హోం మంత్రి వంగలపూడి అనితకు సన్నిహితుడిగా పేరున్న గొర్ల దేముళ్లు తన అనుచరులతో సామాజిక కార్యకర్త నూకరాజుపై హత్యాయత్నం చేయడం సంచలనం కలిగించింది. టీడీపీ నాయకుల భూఆక్రమణలు, అక్రమాలను ఆయన అడ్డుకుంటున్నారు. పాలకులు, అధికారులు, న్యాయమూర్తులకు ఫిర్యాదు చేస్తూ అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. బాధితులకు అండగా నిలుస్తున్నాడు. అదే అక్రమార్కులకు కంటగింపుగా మారింది. గురువారం మధ్యాహ్నం జరిగిన దాడి ప్లాన్ ప్రకారం అడ్డు తొలగించాలన్న లక్ష్యంతోనే జరిగిందని అందరూ భావిస్తున్నారు.

క్లుప్తంగా

నూకాంబికకు గాజుల అలంకరణ



కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో నూకాంబిక అమ్మవారిని గాజులతో గురువారం అందంగా అలంకరించారు. శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం పురస్కరించుకొని ముందుగా ఆనవాయితీగా అలంకరించారు. అర్చకులు మధిర శ్రీరామ్మూర్తి, ఫణీల ఆధ్వర్యంలో పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అప్పన్నను సేవలో పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నారాయణ స్వామి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని అధికారులు అందజేశారు.

అప్పన్న ఆభరణాల తనిఖీ వాయిదా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు సమర్పించిన ఆభరణాలు, బంగారు, వెండి ఇతర విలువైన వస్తువుల తనిఖీ వాయిదా పడింది. వాటిని పరిశీలించేందుకు ఐదుగురు సభ్యుల కమిటీ ఈనెల 7, 8 తేదీల్లో సింహగిరికి వస్తుందని తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆ కమిటీ పర్యటన వాయిదా పడింది. కాగా కమిటీ వస్తుందని భావించిన దేవస్థానం అధికారులు ముందుగానే రికార్డులు భద్రపరిచారు.

నవోదయలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది: నవోదయలో 2025- 26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీ సీట్ల కోసం ఈ నెల 10వ తేదీలోగా దరఖా స్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తును www.navodaya.gov.in నుంచి లేదా కొమ్మాది నవోదయ విద్యాలయం నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

హైదరాబాద్ పోలీసు అదుపులో కేజీహెచ్ వైద్యుడు

మహారాణిపేట: సృష్టి కేసులో కేజీహెచ్‌లో ఒక వైద్యుడిని హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేజీహెచ్‌కు చెందిన ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవిని హైదరాబాద్ పోలీసులు తీసుకొని వెళ్లారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు కేజీహెచ్ వైద్యులు పేర్లు కూడా ఉన్నట్టు తెలుస్తుంది.

మార్కెట్లకు శ్రావణ శోభ

- కొనుగోలుదారులతో దుకాణాల కిటకిట
- చుక్కలు చూపిస్తున్న పూజా సామగ్రి ధరలు
- కిలో చామంతులు రూ.800



కిలో రూ.800 పలుకుతున్న చామంతులు





మార్కెట్లో పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) రూ.9 వేలు పలుకుతున్న లక్ష్మీరూపులు

నక్కపల్లి: సకల సంపదలకు ప్రతీక లక్ష్మీదేవి ఆరాధనకు ఊరూవాడా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మార్కెట్లు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో పూజాసామగ్రి కొనుగోలుదారులతో నక్కపల్లి, అడ్డురోడ్డు, పాయకరావుపేట – తుని పట్టణాల్లో దుకాణాలు, మార్కెట్లు కిటకిటలాడాయి. పూలు, బంగారం, కిరాణా, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి. ఈ ఏడాది బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో గతంలో మాదిరిగా వరలక్ష్మి పూజకు అసవరమైన లక్ష్మీరూపులు కొనేందుకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. గతంలో లక్ష్మీరూపులు రూ.1500 నుంచి రూ.3వేల వరకు లభించేవి. ఈ ఏడాది తక్కువ బరువులో లక్ష్మీ రూపులు విక్రయించడం లేదు. గ్రాము బరువుగల లక్ష్మీరూపు రూ.9,800లకు విక్రయిస్తున్నారు. అన్ని బంగారం షాపుల్లోనే ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో లక్ష్మీరూపు కొనుగోలు చేసి అమ్మవారి పూజ చేసుకోవడం మా వల్ల కాదంటూ సామాన్య, మధ్య తరగతి మహిళలు చేతులెత్తేస్తున్నారు. కొద్దోగొప్పో స్తోమత ఉన్నవారు గ్రాము విలువల లక్ష్మీరూపులను కొనుగోలు చేస్తున్నారు. సామాన్యులైతే ఈ ఏడాది అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు, కొత్త చీర పిండివంటలతోనే కానిచ్చేసే పరిస్థితి నెలకొంది.

పండ్లు, పూల ధరలకు రెక్కలు..

పండ్లు, పూల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. డజన్లలో అరటి పండ్లు రూ.80, చిన్నపాటి యాపిల్ రూ.250, దానిమ్మ రూ.360, జామకాయలు రూ.80 చొప్పున విక్రయించారు. పూల ధరలు చుక్కలను చూపించాయి. చామంతులు ఇంతులకందని పరిస్థితి నెలకొంది. కిలో చామంతి పూలు రూ.800, గులాబీలు కిలో రూ.400 చొప్పున విక్రయించారు. అంత ఖరీదు పెట్టి కొనలేక విడిగా కొనుక్కుందామంటే చామంతి పువ్వు ఒక్కొక్కటి ఐదు రూపాయలకు విక్రయిస్తున్నారు. గులాబీలు రూ.10, కనకాంబరాలు మూర రూ.80, మల్లెలు రూ.100లకు విక్రయించారు. చామంతి, బంతి పూలను విడిగానే కొనుక్కోవాల్సి వచ్చింది. బత్తాయి, దానిమ్మ, జామ, యాపిల్‌ల ధరలు వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని భారీగా పెంచేశారు. ఇంటిల్లిపాది సంగతి అలా ఉంచితే కనీసం అమ్మవారికి తొమ్మిది రకాల పిండివంటలు చేసి నైవేద్యం పెట్టడానికయినా కిరాణా సరకులు కొందామంటే ధరలు చూసి సామాన్యులు గిలగిల కొట్టుకునే పరిస్థితి నెలకొంది. పప్పు దినుసులు, బెల్లం, పంచదార, తదితర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

2 రోజుల్లో నీడ్ అసెస్‌మెంట్ సర్వే పూర్తి చేయాలి

- ఎరువుల అవసరాలను గుర్తించండి
- కలెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: బంగారు కుటుంబాల అవసరాలను దత్తత తీసుకున్న మార్గదర్శులు కల్పించేందుకు నిర్దేశించిన నీడ్ అసెస్‌మెంట్ సర్వే ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. పీ 4, ఎరువులు, డాక్యుమెంటేషన్ అప్‌లోడ్, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆమె మాట్లాడుతూ ఎరువుల అవసరాలను ముందుగా గుర్తించాలని, పటిష్ట పర్యవేక్షణ జరపాలన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ ఆక్టివ్, ఇన్ ఆక్టివ్ ఖాతాల వివరాలు పరిశీలించాలన్నారు. పీ 4లో మార్గదర్శి, బంగారు కుటుంబాల అనుసంధానం, అవసరాల సర్వే అంశాలను పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఎవరినీ బలవంతం చేయవద్దని స్పష్టం చేశారు. పీ-4పై సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా హేండ్‌బుక్‌ను రూపొందించాలన్నారు. ఇందులో సూచనలు పాటిస్తూ అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో జి.రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

షేడ్ నెట్స్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

షేడ్ నెట్స్‌పై రైతులకు మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షేడ్ నెట్స్‌పై ఉద్యానవన, గ్రామీణ అభివృద్ధి, కేతి టెక్ కంపెనీతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 10 మంది రైతులను గుర్తించి వారి వివరాలను ఈ నెల 18వ తేదీ లోపు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు సమర్పించాలన్నారు. షేడ్ నెట్స్ వేసుకున్నట్లయితే చీడ, పీడలు రాకుండా ఉంటాయని, నీరు తక్కువగా అవసరం పడుతుందన్నారు. పంట దిగుబడి 3 రేట్లు అధికంగా వస్తుందన్నారు. ఒక్కసారి షేడ్ నెట్ వేసుకుంటే పదేళ్ల వరకు ఉపయోగపడుతుందన్నారు. షేడ్ నెట్ 13 సెంట్లలో 21 మీటర్లు వెడల్పు, 25 మీటర్లు పొడవు, 4 మీటర్లు ఎత్తు ఉంటుందన్నారు. టమాటా, మిరప, క్యాప్సికమ్, పుచ్చకాయలు, కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటలను ఇందులో పెంచవచ్చన్నారు. యూనిట్ ధర రూ.3,22,800 కాగా, రైతు రూ.1,61,400 తన వాటాధనంగా ఖర్చు చేయాలన్నారు. హార్టికల్చర్ శాఖ నుంచి రూ.1,61,400లు సబ్సిడీ రూపంలో అందిస్తామన్నారు. మహిళా రైతులకు బ్యాంకు రుణాన్ని అందిస్తామన్నారు. గ్రామ సంఘ సహాయకురాలకు ఈ నెల 11న మండల స్థాయిలో పీ4 యాప్‌పై శిక్షణ ఇచ్చి యాప్ నమోదు చెయ్యాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ఎ.రహీమ్, జిల్లా బిందు సేద్యం పథక సంచాలకురాలు జి.వి.లక్ష్మి, ఏపీఎంలు, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీపై చంద్రబాబు,లోకేష్ హామీ గాలికి..

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదాలో చంద్రబాబు ఎన్నికల సమయంలో కె.కోటపాడు మండలం గొందుపాలెం సభలో అధికారంలోకి వస్తే గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి ఆదుకుంటామని హామీ ఇచ్చి ఏడాది దాటిపోతున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద యువగళం బహిరంగ సభలో నారా లోకేష్ సైతం ఫ్యాక్టరీని ఆదుకుంటామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని ఆరోపించారు. ఫ్యాక్టరీపై 24 వేల మంది సభ్య రైతులు, వెయ్యి మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఫ్యాక్టరీని మూత వేయాలని చూస్తే అధికార కూటమికి రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఒకప్పుడు సీజన్‌కు 5 లక్షల టన్నులకు పైగా క్రషింగ్ జరగగా, గత సీజన్‌లో లక్షా 9వేల టన్నులు మాత్రమే క్రషింగ్ జరిగిందన్నారు. 2024–2025 సీజన్‌లో చెరుకు సరఫరా చేసిన రైతులకు 15 రోజులకే రూ. 3వేలు చొప్పున పేమెంట్లు చేసేవారని, ప్రస్తుతం రైతులు, కార్మికులకు రూ. 30 కోట్లు మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ మనుగడ కోసం కూటమి పార్టీల నాయకులు ఎందుకు నోరు మెదపకపోవడం లేదని ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థి



జోనల్ స్థాయి పోటీల్లో సర్టిఫికెట్ అందుకుంటున్న విజయ్‌కుమార్

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి పోటీలకు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం మీద వివిధ పోటీలను నిర్వహించారు. కళాశాల స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో కళాశాలలో బీఏ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.విజయ్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ నెల 6న విశాఖపట్నం డాక్టర్ వి.ఎస్.కృష్ణ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ నెల 11న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, అధ్యాపకులు అభినందించారు.

రాజ్యాంగం ప్రజలందరినీ ఐక్యం చేస్తుంది

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురామ్




వేడుకల్లో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురామ్, యార్లగడ్డ తదితరులు

మద్దిలపాలెం: రాజ్యాంగం దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ(భోపాల్) మాజీ డైరెక్టర్ జస్టిస్ గోడ రఘురామ్ తెలిపారు. ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో గురువారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఎండోమెంట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం, సామాజిక క్రమం రాజ్యాంగ దృక్పథం అనే అంశంపై ఉపన్యసించారు. ప్రజలు తమను తాము పాలించుకోవడానికి ఏర్పాటు చేసుకున్నవే చట్టాలని తెలిపారు. నిత్యం కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విభిన్న అంశాలపై అవగాహన అందించేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శతాబ్ది సంవత్సరంలో ఉన్న ఏయూ ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలను నిర్వహించేలా క్యాలెండర్‌ను విడుదల చేసిందన్నారు. ఇందులో మొదటిదైన ఈ కార్యక్రమం ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తం చేశారు. లా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం న్యాయ కళాశాల ప్రత్యేకతలను, ఎండోమెంట్ లెక్చర్ వివరాలు వివరించారు. ముందుగా న్యాయ కళాశాల వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి, నివాళులర్పించారు. అనంతరం అక్కడ పలు పండ్ల మొక్కలను నాటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకొని న్యాయ కళాశాలలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

- 3 కేజీల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, బైక్ సీజ్



గంజాయి నిందితులతో ఎస్‌ఐ సత్యనారాయణ

దేవరాపల్లి: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను దేవరాపల్లి పోలీసులు అరెస్టు చేశారు. శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద గురువారం ఎస్‌ఐ వి. సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుబడింది. విశాఖ సిటీలోని కంచరపాలేనికి చెందిన సిహెచ్. కార్తీక్, సబ్బవరానికి చెందిన సిహెచ్. ఎర్నిబాబు వేలంమామిడిలో గంజాయి కొనుగోలు చేసి దేవరాపల్లి మీదుగా బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరి నుంచి 3 కేజీల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చోడవరం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటమి భయంతోనే టీడీపీ హత్యా రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు
- పులివెందులలో పార్టీ నేతల దాడిపై సర్వత్రా నిరసన



అనకాపల్లిలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి: ఓటమి భయంతో టీడీపీ హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు ధ్వజమెత్తారు. పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థి ఉప ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగివస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రాముపై హత్యాయత్నానికి పల్పడిన టీడీపీ గూండాలను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వారిపై దాడిని నిరసిస్తూ గురువారం స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతకుముందు మహాత్మ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు విరక్తి చెందారని ఆమె పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభలకు వస్తున్న జనాన్ని చూసి, కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకొని పార్టీ నాయకులపై దాడులు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకట్ మాట్లాడుతూ రమేష్ యాదవ్‌పై దాడులు చేయించిన బీటెక్ రవి తమ్ముడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాము, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయి కిరణ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు బాధపు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే అరెస్టు చేయాలి

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పార్టీ నాయకులపై దాడికి పాల్పడిన టీడీపీ గుండాలను తక్షణమే అరెస్టు చేయాలని సమాజ్‌వాద్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోన గురువయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంబేడ్కర్‌ను కాదని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై కక్ష కట్టారన్నారు.

పక్కా స్కెచ్‌తోనే దాడి



ఈర్లె అనురాధ

దేవరాపల్లి: పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడిని వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ ఖండించారు. తారువలో గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ ప్రజలను, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేసేందుకు పక్కా స్కెచ్‌తోనే దాడికి తెగబడ్డారని ఆరోపించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేలా ఈసీ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

కేజీహెచ్‌లో నీటికి కటకట

- మరమ్మతుకు గురైన మోటార్
- నీటి సరఫరాకు అంతరాయం
- వార్డుల్లో నీరులేక రోగుల ఇక్కట్లు

మహారాణిపేట : కేజీహెచ్‌లో గురువారం గుక్కెడు నీటి కోసం రోగులు తహతహలాడారు. ఆస్పత్రికి పలు ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్న మోటార్లు మరమ్మతులకు గురవడంతో పలు వార్డులకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కార్డియాలజీ, పరిపాలన భవనం, పాత ఎస్-4 వార్డు, ఓపీ నెంబర్ 24 తదితర వాటికి పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రోగులకు తాగడానికి, ఇతర వినియోగానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ యు.శ్రీహరి తదితరులు జోక్యం చేసుకొని రోగులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ నుంచి నీరు తీసుకురావడానికి కృషి చేశారు.

జైల్ పూర్వ అధికారులపై దర్యాప్తు

ఇద్దరు అధికారుల్ని నియమించిన జైళ్ల శాఖ

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో పనిచేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జైళ్ల శాఖ ఇద్దరు అధికారులను దర్యాప్తునకు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రస్తుతం పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ కె.జవహర్‌బాబు, జైలర్లు సీహెచ్ శ్రీనివాస్, పి.కుశకుమార్, ఆర్.చిన్నారావు, ఐ.మురళి, ఎ.ఈశ్వరరావు, గూడూరు కేంద్ర కారాగారంలో అటాచ్‌మెంట్‌పై జైలర్‌గా పనిచేస్తున్న టి.దుర్గారావులపై చార్జ్ మెమోలున్నాయి. దుష్ప్రవర్తన, విధుల్లో నిర్లక్ష్యం, ప్రధాన కార్యాలయం, రేంజ్ కార్యాలయాల ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం తదితర అభియోగాలపై చార్జ్ మెమోలు జారీ చేశారు.

దీనిపై ప్రస్తుతం దర్యాప్తు చేపట్టేందుకు జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్, అనంతపురం జైల్(అగ్రికల్చర్ కాలనీ) సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్‌లను దర్యాప్తు అధికారులుగా నియమించారు. వీరిద్దరు త్వరలో వీరిపై దర్యాప్తు చేపట్టనున్నారు. దర్యాప్తు అనంతరం సేకరించిన ఆధారాలతో నివేదికను జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

మేయర్ తీరు వల్లే క్రాస్ ఓటింగ్

- కార్పొరేటర్లు మేయర్ మధ్య సమన్వయ లోపం
- కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

బీచ్‌రోడ్డు (విశాఖ): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు ప్రధాన కారణం మేయర్ పీలా శ్రీనివాసరావు అని 39వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేయర్ ప్రవర్తన నచ్చక కొంతమంది కార్పొరేటర్లు తమ అసంతృప్తిని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వ్యక్తం చేశారన్నారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత ఆయన వైఖరిలో మార్పు కనిపించిందన్నారు. అదేవిధంగా కార్పొరేటర్లతో సరిగా సమన్వయం చేయలేకపోతున్నారన్నారు. కార్పొరేటర్లు తమ సమస్యలను చెప్పినా పట్టించుకోకుండా మేయర్ సొంత నిర్ణయంతో అహంకారం ధోరణితో ప్రవర్తిస్తున్నారన్నారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత జరిగిన తొలి కౌన్సిల్ సమావేశానికి నిబంధనలకు విరుద్ధంగా తన సోదరుడు పీలా గోవింద్‌ను తీసుకు వచ్చారని పేర్కొన్నారు. మేయర్ తన సోదరుడిని కౌన్సిల్ సమావేశానికి తీసుకురావడం సముచితం కాదని కార్పొరేటర్లు భావించారన్నారు. ఈ నేపథ్యంలో కొందరు కార్పొరేటర్లు అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తం చేసినప్పటికీ మేయర్‌లో మార్పు రాలేదన్నారు. ఇలా అసంతృప్తి చెందిన 22 మంది కార్పొరేటర్లు క్రాస్ ఓటింగ్ ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశారన్నా అభిప్రాయం వ్యక్తమవుతోందన్నారు.

వేపగుంటలో రెచ్చిపోయిన రౌడీలు

- గంగిరెడ్ల కాలనీలో యువకుడిపై బీరు బాటిళ్లతో హత్యాయత్నం
- గంట వ్యవధిలోనే ముగ్గురు నిందితుల అరెస్ట్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని గంగిరెడ్ల కాలనీలో గురువారం సాయంత్రం రౌడీలు రెచ్చిపోయారు. వ్యక్తిగత కక్షలతో ఓ యువకుడిపై బీరు బాటిళ్లతో దాడికి చేసి, హతమార్చేందుకు ప్రయత్నించారు. బాధితుడి కుటుంబ సభ్యులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వడం, ఘటనాస్థలికి సమీపంలోనే బ్లూకోట్స్ పోలీసులు ఉండడంతో యువకుడిని రక్షించారు. పోలీసులను చూసి పరారైన నిందితులు ముగ్గురు గంట వ్యవధిలోనే పట్టుబడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కాలనీలో ఉంటున్న బి.ప్రదీప్‌కుమార్(22)కు అదే కాలనీకి చెందిన ధనకొండ చిన్నోడు(21), సీరం రాజేష్(21), మొండి బ్రహ్మయ్య(21)లతో విభేదాలున్నాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ప్రదీప్ ఇంటి వద్దకు చిన్నోడు, రాజేష్, బ్రహ్మయ్య వచ్చి బయటకు పిలిచారు. ప్రదీప్ వచ్చిన వెంటనే అతనిపై విచక్షిరహితంగా బీరు బాటిళ్లతో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చారు. కాలనీ సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ పీసీ గోవింద్ వెంటనే అక్కడికి చేరుకుని ప్రదీప్‌ను రక్షించారు. ఈ గందరగోళంలో నిందితులు చిన్నోడు, రాజేష్, బ్రహ్మయ్య పారిపోయారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఐ కేవీ సతీష్‌కుమార్, ఎస్‌ఐ స్వామినాయుడు, బృందాన్ని గాలింపునకు ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ముగ్గురు నిందితులను గంటలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు ముగ్గురు గతంలో పలు నేరాల్లో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రౌడీ చర్యలను తీవ్రంగా తీసుకుంటున్నామని.. శాంతిభద్రతలతో పాటు పౌరుల ప్రాణాలకు హానీ తలపెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతురాలు సింహాచలం

కోటవురట్ల: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి.. మండలంలోని రాజుపేట శివారు పి.రామన్నపాలేనికి చెందిన పల్లా సింహాచలం (66) గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. కొంత కాలంగా ఆరోగ్యం బాగుండకపోవడంతో ఇబ్బంది పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె తన ఇంటి బాత్రూంలో ఇనుప రాడ్‌కు నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె పెద్ద కుమారుడు వెంకునాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.



గ్రావెల్ తవ్వి వేణువారి కొండను తొలిచేస్తున్న కూటమి నేతలు



మూడేకరాల మేర గ్రావెల్ కప్పిన శారదా నది ఒడ్డు

వేణువారి కొండపై కన్ను

- రాత్రిళ్లు గ్రావెల్ తవ్వేస్తున్న అక్రమార్కులు
- జనసేన నాయకుడి కనుసన్నల్లో తరలింపు
- కనుమరుగవుతున్న తుమ్మపాల వేణువారి కొండ



శారదా నది ఒడ్డున గ్రావెల్‌తో పూడ్చిన ఇసుక గోతులు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిలోనే సహజ వనరుల దోపిడీ పర్వం మొదలైంది. అక్రమార్కుల ధన దాహార్తికి కొండలు కనుమరుగవుతున్నాయి. నదులు రూపురేఖలు కోల్పోతున్నాయి. కొన్నాళ్లుగా తుమ్మపాల మేజరు పంచాయతీలో సర్వే నంబరు 363–1లో అక్రమంగా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. భారీ కొండలను పెద్దలు పట్టుకుంటే, చిన్న కొండలను మండల నాయకులు అనధికార మైనింగ్‌తో సహజ సంపదను దోచేస్తున్నారు. నిన్నటి వరకు శారదా నదిని తవ్వి ఇసుక తోడేసి, ఇప్పుడు వేణువారి కొండను తవ్వి గ్రావెల్ అక్రమ తరలింపునకు బరితెగించారు.

శారదా నదిలో ఇసుకను తవ్వేసి గ్రావెల్‌తో పూడ్చివేత

మండలంలో తుమ్మపాల మేజర్ పంచాయతీలో శారదా నదికి రెండు వైపులా రెవెన్యూ పరిధి విస్తరించి ఉంది. మూలపేట పరిసరాలలోని శారదా నదిలో ఇసుకతోపాటు ఒడ్డున ఇసుక దిబ్బలను కూటమి నేతలు ఖాళీ చేసేశారు. తుమ్మపాలకు చెందిన జనసేన నాయకుడు తన అనుచరులతో కలిసి నిత్యం రాత్రి సమయాల్లో లారీలను పెట్టి ఇసుకను తరలిస్తున్నారు. ఏడాదిగా నాలుగెకరాల మేర శారదా నది ఒడ్డును అక్రమంగా తవ్వేసి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. నది ఒడ్డున ఏర్పడిన నాలుగెకరాల గోతులను పూడ్చడంతోపాటు గ్రావెల్ అక్రమ వ్యాపారానికి తెరలేపారు. నిన్నటి వరకు నదిలో ఇసుకను తవ్వేసిన అక్రమార్కుల కన్ను ఇప్పుడు కొండపై పడింది. రాత్రి సమయాల్లో భారీ సంఖ్యలో లారీలతో గ్రావెల్‌ను తరలించేస్తున్నారని, తక్షణమే నిలిపివేయకపోతే వేణువారి కొండ కనుమరుగవుతుందని సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మపాలకు చెందిన అక్రమార్కులు రాత్రి సమయాల్లో వస్తున్నారని, ఇసుకతోపాటు గ్రావెల్ తవ్వేసి ఇతర ప్రాంతాలను తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

పట్టణానికి రెండు కిలోమీటర్ల పరిధిలో శారదా నదిలో ఇసుకను, ఇక్కడ ఆనుకుని ఉన్న కొండను తొలిచేస్తూ ఏడాదిగా కూటమి నేతలు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి కొండ నుంచి ఏలేరు కాలువ ఆనుకుని అక్రమ మైనింగ్ కార్యకలాపాల కోసం మామిడితోటల మీదుగా బాట వేసి రోజూ రాత్రిళ్లు భారీ సంఖ్యలో ఇసుక, గ్రావెల్‌ను లారీల్లో తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. చిన్నపాటి గృహావసరాలు, పొలాల్లో చదును కోసం రైతులు, సామాన్యులు ఇసుక, గ్రావెల్ తరలిస్తే భారీగా ఫైన్లు, ట్రక్కులను సీజ్ చేసి ముప్పుతిప్పలు పెట్టించే మైనింగ్, పోలీస్, విజిలెన్స్ అధికారులు కూటమి నాయకుల మైనింగ్ అక్రమాలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి



రద్దీగా చిన నాలుగురోడ్ల జంక్షన్ మార్కెట్ రహదారి



రద్దీగా మళ్ల బ్రదర్స్ బంగారం షాపు



కశింకోట వారపు సంతలో చీరల విక్రయాలు



పండ్ల విక్రయాలు

అనకాపల్లి టౌన్: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలో పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. ప్రధానమైన నెహ్రూచౌక్, చిన నాలుగురోడ్ల జంక్షన్లలో షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కిరాణా, వస్త్ర, బంగారం, పూజా సామగ్రి, పండ్ల దుకాణాల వద్ద బారులు తీరారు. ఏటా రెండో శుక్రవారం నిర్వహించే శ్రావణలక్ష్మి వ్రతం ఈ సంవత్సరం మూడో శుక్రవారం జరుపుకుంటున్నారు. ఆడవారు ఈ పండగ ఎంతో ప్రాముఖ్యమైనదిగా భావిస్తారు. ఈ పండగలో ప్రధాన పాత్ర పోషించే బంగారం ధర సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. అయినా ప్రతి గృహిణి వారి స్థోమత బట్టి బంగారం కాసు తప్పనిసరిగా కొనుగోలు చేసి పూజించడం ఆచారంగా భావిస్తారు. గురువారం మార్కెట్లో 24 క్యారెట్ బంగారం లక్ష్మీదేవి కాసు రూ.10,200 అమ్మకాలు చేశారు. దీంతో కొంత మంది పాత బంగారాన్ని ఇచ్చి కొత్త వస్తువులు కొనుగోలు చేశారు. బంగారం కొనలేని సామాన్యులు అమ్మవారికి కొత్త చీర, పసుపు, కుంకుమ, పండ్లు, కాయలతో శ్రద్ధగా పూజించుకుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ పండగలో ధరలు అందుబాటులో లేవు. కొబ్బరి కాయ నుంచి పండ్లు, పూలు వరకు ధరలు అధికమవ్వడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కొబ్బరికాయ పెద్దది రూ.50, అరటి పండ్లు డజన్ రూ.80 నుంచి రూ.100, యాపిల్ రూ.100కి నాలుగు, బొత్తాయి రూ.100 ఐదు, ఇక పూలు సంగతి చూస్తే చామంతి, కలువ, సంపెంగ రూ.20కు మూడు అమ్మకాలు చేశారు. విశాఖకు దీటుగా పట్టణంలో వస్త్ర దుకాణాలు రావడంతో రూరల్ ప్రాంతాల నుంచి అనేక మంది కొనుగోలు చేశారు.

కశింకోట: స్థానిక వారపు సంతలో వరలక్ష్మీదేవి వ్రతం పురస్కరించుకుని ప్రజలు పూజా సామగ్రి జోరుగా కొనుగోలు చేశారు. దీంతో వస్త్ర దుకాణాలు, పండ్ల దుకాణాలు, గాజుల దుకాణాలు, పూల దుకాణాలు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కళకళలాడాయి. పండ్లకు గిరాకీ ఏర్పడింది. చీరలు, రవికెలు ఎక్కువగా కొనుగోలు చేశారు. అమ్మవారికి నివేదించడానికి కొత్త బియ్యం, శనగలు, మినుములు, పెసలు, ఇతర దినుసులు ఎక్కువగా కొనుగోలు చేశారు. దీంతో కిరాణా దుకాణాలు, చిల్లర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి.

క్లుప్తంగా

23 నుంచి బాక్స్ క్రికెట్ టోర్నమెంట్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక రింగ్‌రోడ్డు సాధన క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేత జట్టుకు ఈ నెల 27న సాయంత్రం ప్రథమ, బహుమతులుగా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ రూ.20 వేలు, పార్టీ సీనియర్ నాయకుడు వెలుగుల కృష్ణచైతన్య రూ.10 వేలు అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9553403389, 6302276714 సంప్రదించాలని కోరారు.

42 మంది రక్తదానం



బ్లడ్ బ్యాంక్‌లో పాల్గొన్న దాతలు

అనకాపల్లి టౌన్: స్థానిక వైఎంవీఏ హాల్‌లో డొక్కా సీతమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ జరిగింది. దివంగత స్నేహితులు అశ్విన్, తేజల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌లో 42 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్త దాతలకు పౌష్టికాహారంతో కూడిన ప్యాక్‌ను అందజేశారు. కార్యక్రమంలో డొక్కా సీతమ్మ సంస్థ సభ్యులు మడపాల ధనూష్, ఆదాడ వంశీ, మందపల్లి నానీ, గొర్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై అవగాహన



మాట్లాడుతున్న ఐటీ ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ గ్లోబల్ ఉపాధ్యక్షుడు రామ్

అనకాపల్లి టౌన్: సాఫ్ట్‌వేర్‌లో తాజా టెక్నాలజీపై గురువారం స్థానిక డైట్ కాలేజీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగామ్ జరిగింది. ఈ సందర్భంగా యూఎస్‌ఏ ఐటీ ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్ గ్లోబల్ ఉపాధ్యక్షుడు పెంటకోట రామ్ మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సాధనాలు, అనువర్తనాలు నేటి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమపై పడుతున్న ప్రభావాన్ని విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ఆర్డీ డాక్టర్ కె. సుజాత పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కి, సీనియర్ అసిస్టెంట్‌కి చెక్కు అందజేస్తున్న దాత ఈశ్వరరావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పెదగంట్యాడకు చెందిన సంపంగి ఈశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కు అందజేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 63 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	4,700
రెండో రకం	---	---
మూడవ రకం	3,000	3,480

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాత్ర
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్–19, ఓ పాజిటివ్–28, ఏబీ పాజిటివ్–5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

రూ.20కే రూ. 2 లక్షల ప్రమాద బీమా



ప్రమాదబీమా ఉపయోగాలు తెలిపే బ్రోచర్‌ను విడుదల చేస్తున్న బ్యాంక్ అధికారులు



సమావేశానికి హాజరైన బ్యాంక్ ఖాతాదారులు, డ్వాక్రా మహిళలు

అనకాపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఇన్‌చార్జి షాలనీ మీనన్ తెలిపారు. స్థానిక గుండాల జంక్షన్ శంకరన్ మీటింగ్ హాల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంప్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై ఖర్చు సంవత్సరానికి రూ. 20 కాగా, రూ.2 లక్షల యాక్సిడెంట్ బీమా వర్తిస్తుందన్నారు. పీఎంజేజేబీవై ఖర్చు సంవత్సరానికి రూ.436 కాగా, 18 నుంచి 55 సంవత్సరాల వారు సహజ మరణం లేదా ప్రమాద మరణానికి రూ. 2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఖాతాదారులందరూ ఈ బీమా పథకాలను బ్యాంకులో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రమాద బీమా ఉపయోగాలు తెలిపే బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ హెడ్ జితేంద్రశర్మ, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలను చెల్లించాలని డిమాండ్

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ -వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నెహ్రూచౌక్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్ కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్ చెల్లించకుండా వారి శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారన్నారు. మూడు మాసాలుగా జీతాలు లేక కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నత స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కాంట్రాక్టులు కార్మికుల జీతాలను చెల్లించే విధంగా ఆస్పత్రులు సూపరింటెండెంట్లు తక్షణమే చర్యలు చెపట్టాలని కోరారు. చాలీచాలని జీతాలతో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు.

జీవోపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తాం



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

అనకాపల్లి: పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలను నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. బాబ్జి, జి. ఫణీంద్ర కుమార్ తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉత్తర్వులను దహనం చేసి, విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకుల వేనని చైతన్య, నారాయణ, భాష్యం పాఠశాలల ఫీజుల దోపిడీని, పుస్తకాలను అధిక ధరలు అమ్మకోవడానికీ, విద్యను వ్యాపారం చేసుకోవడానికి మేలు కోసమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు దివ్య, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



గర్భిణులను దీవిస్తున్న ఎంపీడీవో ధర్మారావు, ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి తదితరులు



ఉత్సాహంగా హాజరైన గర్భిణులు

కశింకోట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం కశింకోటలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లి పాల వారోత్సవాలు ముగింపు పురస్కరించుకొని గర్భిణులకు కొబ్బరి బొండాం, వాయినాలు ఇచ్చి అక్షంతలు, హారతులతో ఆశీర్వదించి దీవించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి మాట్లాడుతూ తల్లి పాలు మొదటి టీకా అని, తప్పనిసరిగా ప్రసవం అనంతరం తల్లి పాలను పిల్లలకు పట్టించాలన్నారు. మొదటి రెండు రోజులతోపాటు ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం వల్ల పిల్లలు ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారన్నారు. ఎంపీడీవో కె. ధర్మారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు, డ్వాక్రా ఏపీఎం పార్వతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఝాన్సీ, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వారపు సంతలో పెరిగిన పైనాపిల్ ధర

మాడుగుల రూరల్ : సీజన్ ఆఖరి కావడంతో పైనాపిల్ ధర పెరిగింది. మాడుగులలో గురువారం జరిగిన వారపు సంతలో ఒక్కో పండు ధర రూ.15–16లకు పెరిగింది. దేవాపురం పంచాయతీ శివారు గ్రామాలైన కక్కి, కందిలపాలెం, పులుసుమామిడి, అయినాడ, పంచాయతీ శివారు గ్రామాల నుంచి పైనాపిల్‌ను గిరి రైతు లు విక్రయానికి తీసుకొచ్చారు. రెండు వారాల క్రితం పైనాపిల్ పండు ధర కేవలం రూ. 4లకు విక్రయించారు. ఒకేసారి రేటు పెరగడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేసారు. అలాగే పనస పండ్లు కూడా గతంలో రూ.50లు ఉండగా, ఈ వారం రూ.100కు విక్రయించారు.

గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి



ఉపాధి హామీ పథకం పనులపై గ్రామపటం ద్వారా అవగాహన

తుమ్మపాల: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుందని సర్పంచ్ శానాపతి లక్ష్మి తెలిపారు. మండలంలో కోడూరులో ఉపాధి హామీ పథకంపై వేతనదారులకు సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులు గ్రామానికి చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఎస్‌ఆర్పీ దాసు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఈసీ) టీం ద్వారా గ్రామంలో ఉపాధి వేతనదారుల హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. వేతన రేటు (రూ.307) ఉపాధిలో కల్పిస్తున్న 94 రకాల పనుల గురించి వివరించారు. గ్రామంలో ఇప్పటి వరకు చేసిన పనులు, భవిష్యత్‌లో చేయవలసిన పనులు వివరాలను గ్రామపటం ద్వారా వెల్లడించారు. అంతకుముందు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కశింకోటలో భారీ వర్షం



కశింకోటలోని ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో చేరిన వర్షపు నీరు



కశింకోట బస్ స్టేషన్‌లో చేరిన నీరు

కశింకోట: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షం దంచి కొట్టింది. దీంతో జాతీయ రహదారి వెంబడి బయ్యవరం, కశింకోట, తాళ్లపాలెం, జమాదులపాలెం, పరవాడపాలెంల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్లలో నీరు చేరింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది చెందారు. మరోవైపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్ర ఉష్ణోగ్రతతో ఎండ కాయడం వల్ల ప్రజలు కొనుగోలు చేయడానికి కశింకోటలో వారపు సంతకు రాకపోవడంతో దుకాణాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం వర్షం కురియడంతో రాలేదు. ఆ తర్వాత వర్షం తగ్గడంతో సాయంత్రం ప్రజలు తరలి రావడంతో ముమ్మరంగా అమ్మకాలు సాగాయి. దీంతో దిగాలు చెందిన వ్యాపారులు కాస్త ఉపశమనం చెందారు. వర్షం, ఎండ కారణంగా సరైన బేరాలు లేక నష్టపోయామని వ్యాపారులు వాపోయారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి నిలపాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న కోరారు. మండలంలోని సుందరయ్యపేటలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండుతాయన్నారు. ఇవి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. కషాయాలు వాడటం వల్ల పురుగులు, తెగుళ్ల పంటలపై నివారించవచ్చునన్నారు. పశు వైద్యాధికారి డయానా మాట్లాడుతూ ప్రతి పశువుకు టీకాలు, నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. ఆత్మ ఏటీఎం పి. రామకృష్ణ మాట్లాడుతూ సాగులో రసాయనిక ఎరువులు, మందులు వాడటం వల్ల పండించే పంటలు తినడం వల్ల మనుషులు అనారోగ్యాల బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ రంజిత, గ్రామ ఉద్యాన వన అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం ఎంటీ వెంకట్, ఎన్‌సీఆర్పీ డి. రమణ, ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ, ఎల్ 2 డి. వెంకటలక్ష్మి, బి. వరలక్ష్మి, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నరసాపురం ఆనకట్ట లీకేజీకి అడ్డుకట్ట



ఇసుక బస్తాలు దింపి రంధ్రాలను తాత్కాలికంగా పూడ్చివేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద శారదా నదిపై నరసాపురం ఆనకట్ట తలుపుల నుంచి నీరు లీక్ అవుతుండటంతో తాత్కాలిక మరమ్మతులను గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇసుక బస్తాలు, గడ్డి నిండిన బస్తాలు తాళ్లతో తలుపుల దిగువకు దింపి నీరు లీక్ కాకుండా రంధ్రాలను పూడ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు తలుపులకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీనివల్ల కొంతమేర నీటి లీక్‌ను అరికట్టగలిగామని, మిగిలిన రెండు తలుపులకు ఇదేవిధంగా తాత్కాలిక నీటి లీక్ అరికట్టే చర్యలు తీసుకుంటున్నామని ఆనకట్ట నీటి సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు, యలమంచిలి నీటిపారుదల శాఖ ఏఈ ప్రేమ్ తెలిపారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణ గడువు పెంపు

కశింకోట: గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణ గడువును డిసెంబర్ ఆఖరు వరకు పొడిగించినట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ కె. రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సగం రాయితీ ఉందన్నారు. సమీప మీ సేవ కేంద్రంలోగాని, సచివాలయాల్లోగాని, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లోగాని దరఖాస్తు చేసుకుని తగిన చార్జీలు చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కింద గృహ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకుంటే ఇందుకు అయ్యే ఖర్చులో కొంత మేర ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. తక్కువ వడ్డీకి రుణ సహాయాన్ని అందిస్తుందన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సేవలందించడానికి పది సెక్షన్ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను పరిష్కారం కోసం తెలియజేయాలని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.